గందరగోళంగా ధాన్యం కొనుగోలు

- సంచుల సరఫరా అరకొర
- లారీల కొరతతో ఇక్కట్లు
- మిల్లులకు ధాన్యం తరలిస్తున్న రైతులు

తిరువూరు: రెవెన్యూ డివిజన్‌లోని పలు గ్రామాల్లో రబీ ధాన్యం కొనుగోలు గందరగోళంగా మారింది. 41 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, 5 కేంద్రాల్లో మాత్రమే ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరుగుతోంది. ఇటీవల ధాన్యం కొనుగోలులో నెలకొన్న ఇబ్బందులపై 'సాక్షి'లో వచ్చిన కథనాలతో స్పందించిన పౌరసరఫరాల జిల్లా మేనేజరు సతీష్ క్షేత్రస్థాయి పరిశీలన జరిపి రైతులు, సిబ్బందితో మాట్లాడారు. ఇకపై సంచుల కొరత లేకుండా చూస్తామని, రైతుల నుంచి సేకరించిన ధాన్యం త్వరితగతిన మిల్లులకు చేరవేసేందుకు లారీలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కానీ ఇంతవరకు ఈ ప్రక్రియ ఊపందుకోలేదు. ఖాళీ సంచులు అవసరానికి తగినన్ని రాకపోవడం, వచ్చినా కొందరికే వాటిని సర్దు బాటు చేస్తుండటంతో అధికశాతం రైతులు నిత్యం కొనుగోలు కేంద్రాల ఎదుట పడిగాపులు పడక తప్పని పరిస్థితి నెలకొంది. 5 మండలాల్లో 82 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించాలని లక్ష్యంగా తీసుకున్న పౌరసరఫరాల అధికారులు కొనుగోలు కేంద్రాల ద్వారా 20 శాతం కూడా సేకరించలేదు.


జీకొత్తూరు నుంచి ట్రాక్టర్లపై మిల్లుకు ధాన్యం తరలిస్తున్న రైతులు


రాజుగూడెంలో ధాన్యం తడవకుండా పట్టాలు కప్పి ఉంచిన రైతులు

రైతుల గోడు పట్టించుకోని అధికారులు..

ధాన్యం ఆరబెట్టి 10 రోజులు గడుస్తున్నా పౌరసరఫరాల అధికారులు వాటిని తరలించడానికి ఏర్పాటు చేయట్లేదని తిరువూరు మండలంలోని రాజుగూడెం, వావిలాల గ్రామాల రైతులు పలు మార్లు తిరువూరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రాత్రివేళలో వస్తున్న సంచులను గుట్టుచప్పుడు కాకుండా సహకార సంఘ సిబ్బంది కొందరు రైతులకు చేరవేస్తున్నారని ఆరోపిస్తున్నారు. చింతలపాడు సహకార సంఘంలో సైతం ఖాళీ సంచుల సరఫరా లేక రైతులు నిత్యం కళ్ళాల్లోని ధాన్యం వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది.

ధాన్యం తరలింపునకు లారీలేవి...?

తిరువూరు డివిజన్లోని 5 మండలాల్లో సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు చేరవేసేందుకు అవసరమైన లారీలు ఏర్పాటు చేయట్లేదని రైతులు చెబుతున్నారు. ప్రతి సహకార సంఘం పరిధిలో ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న అధికారులు ఖాళీ సంచుల సరఫరా, లారీల ఏర్పాటులో జాప్యం చేస్తుండటంతో రైతులు ప్రైవేటు వ్యాపారులు, దళారుల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం ధాన్యం క్వింటాలుకు రూ.2350 మద్దతు ధర నిర్ణయించగా, ప్రైవేటు వ్యాపారులు రూ.1600 నుంచి రూ.1750 వరకు చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. లారీలు లేకపోవడంతో తమ సొంత ట్రాక్టర్లపై ధాన్యాన్ని మిల్లర్లకు తరలిస్తున్నారు. రోజురోజుకు మారుతున్న వాతావరణం కారణంగా రైతులు ధాన్యం తడిసిపోకుండా త్వరితగతిన విక్రయించాలని భావిస్తుండగా, తదనుగుణంగా సదుపాయాలు కల్పించట్లేదు.

ధాన్యం తరలించట్లేదు



వావిలాల పీఏసీఎస్‌లో ధాన్యం విక్రయించి వారం గడిచినా బస్తాలు తరలించట్లేదు. మిల్లుకు ధాన్యం పంపడానికి లారీలు రావాలని చెబుతున్నారు. అవి వచ్చేవరకు ధాన్యం తడవకుండా చూసుకోవాల్సిన బాధ్యత మాదే అంటున్నారు. వెంటనే లారీలు ఏర్పాటు చేసి ధాన్యం మిల్లుకు పంపాలని అధికారులను కోరుతున్నాం.

– మన్నె వెంకటేశ్వరరావు, రాజుగూడెం

నిత్యం పడిగాపులే

రబీ ధాన్యం కొనుగోలులో సొసైటీ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రాజుగూడెంలో 20 మందికి పైగా రైతులకు సంచులు ఇవ్వకపోవడంతో కళ్ళాల్లోని ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసి ఎదురుచూడాల్సి వస్తోంది. ఇకనైనా అధికారులు మా గోడు పట్టించుకోవాలి.

– కంచపోగు వెంకటేశ్వర్లు, రాజుగూడెం

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

రబీ ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. పౌరసరఫరాల విభాగం జిల్లా మేనేజరు ఆదేశాల మేరకు అదనపు వాహనాలను సమకూర్చి ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తాం. సంచులను కూడా అవసరానికి తగినట్లు సరఫరా చేస్తున్నాం.

–శ్వేత, పౌరసరఫరాల డెప్యూటీ తహసీల్దార్, తిరువూరు

క్లుప్తంగా

లోక్ అదాలత్ విజయవంతం చేయాలి



తిరువూరు: మే 10న జాతీయ లోక్ అదాలత్ జరగనున్నందున రాజీ చేసుకోదగిన కేసులను గుర్తించి కక్షిదారులను ప్రోత్సహించాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సింధూర కోరారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీస్, ఎక్సైజ్, రవాణా శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించి అదాలత్ గురించి వివరించారు. కక్షిదారుల సమ్మతి మేరకు కేసులు రాజీ చేసేందుకు ప్రయత్నించాలని కోరారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి సూర్యతేజ, న్యాయవాదులు సంకురాత్రి జనార్ధనరావు, మరసకట్ల కుమార్, ఏజీపీ రాము, ఏపీపీ బడేమియా, ఎస్‌ఐలు సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే చిన్నారులను చేర్పించండి



మైలవరం: సర్కారు బడులలోనే చిన్నారులను చేర్పించండని మైలవరం 6వ వార్డులోని ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.గోపాల్ తెలిపారు. స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం సందర్శించి 5 ప్లస్ విద్యార్థుల కోసం ఇంటింటి సర్వే నిర్వహించి ఇద్దరు చిన్నారులను పాఠశాలలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వసతి ఉందని, స్టడీ కిట్లు ఇస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి చిన్నారులను విద్యావంతులను చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్‌రావు, అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జి.కొండూరు: ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులు ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈఓలు పీవీ నర్సింహారావు, వీరాస్వామి తెలిపారు. జి.కొండూరు, కట్టుబడిపాలెం ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతిలో నూతనంగా చేరిన చిన్నారులకు ఎంఈఓలు సోమవారం అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా శిక్షణ బాలికలకు సర్టిఫికెట్లు


మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తివిద్యా శిక్షణలో భాగంగా అగ్రికల్చర్ ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన టెన్త్‌క్లాస్ బాలికలకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దేవిడ్ రాకోఫెల్లర్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలోని వివిధ వృత్తులపై అవగాహన పెంచుకోవడం ద్వారా త్వరగా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. వృత్తివిద్య శిక్షణకు ముందుకొచ్చిన వారిని అభినందించారు. ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, నాన్సీ, సీఆర్పీ డి.నాగేశ్వరరావు, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

రంగనాయకులకి సేవారత్న అవార్డు



జి.కొండూరు: మండల పరిధి వెలగలేరు గ్రామానికి చెందిన రంగస్థల కళాకారుడు పోలుదాసు రంగనాయకులు చంద్రన్న సేవారత్న అవార్డును ఆదివారం అందుకున్నారు. విజయవాడలోని గాంధీనగర్ కందుకూరి కళ్యాణ మండపంలో పీఎంకెఎం ఫైన్ ఆర్ట్స్ 44వ జాతీస్థాయి నాటిక పోటీలలో భాగంగా తనకు ఈ అవార్డు దక్కిన్నట్లు రంగనాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాచీన నాటకరంగానికి ఊపిరి పోసేందుకు ఆయన తన వెలగలేరు ఆదర్శ గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థ ద్వారా చేస్తున్న సేవలు, సామాజిక చైతన్యం కోసం తాను నటిస్తూ అనేక పరిషత్తులలో ఇచ్చిన నాటక ప్రదర్శనలు వల్లన తనకు ఈ గౌరవం దక్కినట్లు తెలిపారు.

రామాలయంలో శ్రీరామ పట్టాభిషేకం



తిరువూరు: గంపలగూడెం రామాలయంలో శ్రీ సీతారామస్వామి 16 రోజుల పండుగ సందర్భంగా స్వామివారి పట్టాభిషేక మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవయాజనం శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా చేశారు.

అవార్డ్‌కు సహకరించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ప్రకటించిన జాతీయ పంచాయతీ అవార్డ్స్ 2025లో గొల్లపూడి పంచాయతీకి ఆత్మనిర్భర్ పంచాయత్ ప్రత్యేక అవార్డ్ రావడానికి సహకరించిన కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు సంబధిత అధికారులు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం జిల్లా పంచాయతీ అధికారి లావణ్య, స్పెషల్ ఆఫీసర్ (ఈఓఆర్‌డీ) మన్నె వెంకట దుర్గా వరప్రసాద్, గొల్లపూడి పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్వరూపరాణి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక బహూకరించారు. కేంద్ర అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చోటుచేసుకోవడం, అందునా గొల్లపూడి గ్రామ పంచాయతీకి ఆత్మనిర్భర్ అవార్డ్ దక్కటం తమ సమష్టి కృషి ఫలితంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అందుకు అన్ని విధాల సహకరించి వెన్నుదన్నుగా నిలబడినందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు

చాట్రాయి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో రబీ ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి బి.శివ శంకర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 17 తేమ శాతం ఉన్న ఏ గ్రేడ్ ధాన్యాన్ని క్వింటా రూ.2,320, కామన్ రకం ధాన్యం రూ.2,300 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. మొక్కజొన్న పంట 90 శాతం కోతలు పూర్తయ్యాయని, మొక్కజొన్న వ్యర్థాలను తగలపెట్టవద్దని సూచించారు. 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.

అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. దీనిలో భాగంగా డివిజన్‌లోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి సబ్ కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలకు సంబంధిత అధికారులు గడువులోగా నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని కోరారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై ప్రజల్లో నమ్మకం పెంచాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. మొత్తం 25 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, హెచ్‌ఓ ఆర్ హేమ, ఏఓ చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు తీసుకుంటున్న సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

పోషకాహారంతో ఆరోగ్యం

మైలవరం: పిల్లలు, మహిళలకు ఆరోగ్యకరము, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే పోషణ్ అభియాన్ లక్ష్యమని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డీన్ ఆర్ అండ్ డీ డాక్టర్ ఎస్. పిచ్చిరెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేర కు స్థానిక ఎంపీపీఎస్ స్కూల్‌లో పోషణ్ పఖ్వాడా -2025 కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పోషణ్ పఖ్వాడా అనేది యుక్త వయసులో ఉన్న బాలికలు, గర్భిణులు, పాలిచ్చే తల్లుల కోసం 0-6 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లల పోషకాహార స్థాయిలను మెరుగుపర్చడానికి ఉద్దేశించిన జాతీయ కార్యక్రమం అన్నారు. యన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి. శివహరిప్రసాద్ మాట్లాడుతూ పోషణ్ పఖ్వాడా 7వ ఎడిషన్ ఏప్రిల్ 8 నుంచి 23వరకు కొనసాగుతుందన్నారు. యన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి. శివహరి ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుప్రియకుమారి పాల్గొన్నారు.


మైలవరం ఎంపీపీ స్కూల్‌లో పోషక్ పఖ్వాడా గురించి వివరిస్తున్న డాక్టర్ శివహరిప్రసాద్

హామీల అమలుపై పోరాటాలకు సిద్ధం

రాష్ట్ర రజక సంఘం నాయకుల డిమాండ్

ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వం రజకులకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాటాలకు సిద్ధపడాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర 7వ మహాసభలు సందర్భంగా రెండోరోజు స్థానిక ఎంవీఆర్ కళ్యాణ మండపంలో ప్రతినిధుల మహాసభ సోమవారం జరిగింది. 16 జిల్లాల నుంచి 180 మంది ప్రతినిధులు చర్చలకు హాజరయ్యారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ బీసీలకు రక్షణ చట్టం తెస్తామని చెప్పిన ప్రభుత్వం 11 నెలలుగా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రజకులపై దాడుల నివారణకు అట్రాసిటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రజక కార్పొరేషన్ ద్వారా రూ.1,000 కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గురుశేఖర్ మాట్లాడుతూ 50 ఏళ్లు దాటిన రజక వృద్ధులకు పింఛను మంజూరు చేయాలని కోరారు. పలు తీర్మానాలు ఆమోదించారు. 45 మందితో నూతన పాలకవర్గం కమిటీ ఎన్నుకున్నారు. పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.


రాష్ట్ర ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న భాస్కరయ్య తదితరులు

సైబర్ నేరాల నివారణపై అవగాహన



తిరువూరు: బ్యాంకులో పెద్ద ఎత్తున లావాదేవీలు నిర్వహించే వారిపై మేనేజర్లు, సిబ్బంది నిఘా ఉంచాలని ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. తిరువూరు పట్టణంలోని బ్యాంకు మేనేజర్లు, సిబ్బందికి సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులపై సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో అధికారులుగా నటిస్తూ నకిలీ ఫోన్ కాల్స్, వీడియో కాల్స్‌తో బ్యాంకు ఖాతాదారులను మోసగిస్తున్నారని చెప్పారు. తిరువూరులోని యాక్సిస్ బ్యాంకు, స్టేట్ బ్యాంకులలో సిబ్బందికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఆన్‌లైన్ బైబిల్ క్విజ్ పోటీలు

చాట్రాయి: మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన కల్లెపల్లి రాజేష్ శ్రమల దినాలను పురస్కరించుకుని 40 రోజులపాటు ఆన్‌లైన్ బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలో బొబ్బిలి దుర్గాభవాని (ఏలూరు), రెండవ స్థానంలో రేవులగడ్డ మోహన (ఏలూరు) మూడవ స్థానంలో అబ్బదాసరి శ్రీను, 4వ స్థానంలో కె.ఏసోబు నిలిచారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ



తిరువూరు: మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయుడు ఎం.రాంప్రదీప్ ఫర్నీచర్ అందజేశారు. కంప్యూటర్ టేబుల్, కుర్చీలు, ఆఫీసు సామగ్రిని ప్రధానోపాధ్యాయురాలు ఆదిలక్ష్మికి అందజేశారు. గతంలో కంప్యూటర్లను రాంప్రదీప్ పాఠశాలకు అందించారు. సహ ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, సాయిరాం, రామారావు, సుదర్శన్, సాంబశివరావు, వెంకటేశ్వర్లు అభినందించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

తిరువూరు: ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన పోలీస్ కానిస్టేబుల్ చిల్లపల్లి శ్రీనివాసరావు కుటుంబానికి తోటి కానిస్టేబుల్స్ రూ.2లక్షల 22వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. 2011 బ్యాచ్ కానిస్టేబుల్స్ సేకరించిన ఈ సొమ్మును శ్రీనివాసరావు కుమార్తెలకు అందజేశారు.

నిండిన చెరువులు

చాట్రాయి: ఇటీవల పంపిణీ చేసిన సాగర్ జలాలతో మండలంలోని చెరువులు జలకళతో కళకళలాడుతున్నాయి. చాట్రాయి పెద్ద చెరువు, దీప చెరువు, జనార్ధనవరంలో రెండు చెరువులకు పూర్తి మట్టంలో నీళ్ల నింపారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లోని సాగు, తాగునీటి బోర్లల్లో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో వేసవిలో తాగు నీటి ఇబ్బంది ఉండదని రైతులు చెబుతున్నారు. అంతేగాకుండా ఖరీఫ్‌లో వరి నారుమళ్లకు నీరు పుష్కలంగా వినియోగించుకోవచ్చునని రైతులు అంటున్నారు.

మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు

నూజివీడు: వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలోని గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ సోమవారం తెలిపారు. దీనిలో భాగంగా బోర్లు, హ్యాండ్‌పంప్‌లు మరమ్మతులుంటే వాటిని 48 గంటల్లో పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. బోర్ల మరమ్మతులకు సంబంధించిన సామగ్రి కూడా సిద్ధంగా ఉందన్నారు. మే, జూన్ నెలల్లో ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. మీర్జాపురం, గొల్లపల్లి, తుక్కులూరు, అన్నవరం, బత్తులవారిగూడెంలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో పశువులకు తాగునీరు అందించేందుకు గాను నీటి తొట్టెలను సైతం సిద్ధం చేశామన్నారు. మంచినీటి సమస్యలు ఎక్కడైనా ఉంటే ప్రజలు వెంటనే ఆయా గ్రామ సర్పంచ్‌లకు, సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



ఆగిరిపల్లి: మండలంలోని ఈదర ఆదర్శ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు మక్కే వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐదుగురు విద్యార్థులను నవోదయకు అర్హత సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయుడు యాదల రవిని ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనందబాబు సన్మానించారు. విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాలరావు రూ.3 వేలు నగదును అందజేశారు. సర్పంచ్ దొండపాటి అనిత, జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం శారద పాల్గొన్నారు.

మృతుడి నేత్రాల దానం

తిరువూరు: తిరువూరులో సోమవారం మృతి చెందిన పబ్బతి ప్రసాద్ నేత్రాలను కుటుంబ సభ్యులు లయన్స్ క్లబ్‌కు దాన మిచ్చారు. విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ నేత్రశాల వైద్యులు మృతుడి కార్నియాలను సేకరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు నాగుబండి ప్రకాశరావు, కొమ్మినేని రాజేష్‌ఖన్నా, వేములపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మిక లేబర్ కోడ్స్ రద్దు చేయాలి


పుస్తకాలు ప్రదర్శిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కార్మికుల హక్కులకు ఆటంకంగా మారిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. కొండపల్లి పారిశ్రామికవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకు మే 20న దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మె విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల కష్టం, హక్కులు, పని గంటల పెంపు, అరకొర వేతనాలు, పనిభారం పెంపు కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టిందని విమర్శించారు. శ్రమ దోపిడీని అరికట్టేందుకు ఉద్యమాలు చేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. కనీస వేతన చట్టం, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్‌పై ప్రచురించిన బుక్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు సుందరరావు, కార్యదర్శి శేషగిరి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ఆగిరిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ గోళ్ళ అనూష అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. విద్యుత్ ఏఈ రామారావు మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యలు ఉంటే సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ ఏఈ రాజు మాట్లాడుతూ గతంలో వచ్చిన వరదల కారణంగా 18 చెరువులకు గండ్లు పడ్డాయని, వాటికి మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. హౌసింగ్ ఏఈ సుందర్ కుమార్ మాట్లాడుతూ మండలంలో అసంపూర్తిగా నిలిచిన గృహ నిర్మాణాలకు సంబంధించి బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని పేర్కొన్నారు. లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఎంపీపీ అనూష మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టి కి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, వైస్ ఎంపీపీ కొండ వరదల రమేష్, డెప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్, ఏవో అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయురాలికి సత్కారం



నూజివీడు: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో సోషల్ టీచర్ పులవర్తి సుజాత నిర్మల ప్రభామణి కృషి అభినందనీయమని హైస్కూల్ హెచ్‌ఎం వీవీఎస్ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌లో సోషల్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన సజాత ప్రభామణి దంపతులను పాఠశాల ఉపాధ్యాయుల బృందం సోమవారం సత్కరించింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసినప్పుడు సమాజంలో ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా దళిత జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సత్తా నాగేశ్వరరావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు స్టాన్లీ ప్రభాకర్, బొద్దుకోళ్ల సుదర్శన్‌రావు, డీడీ సుధాకర్, మోచర్ల బాబూరావు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

చాట్రాయి: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చీపురుగూడెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేశామని, ఈ దాడుల్లో బొర్రా శ్రీను అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం: హైవే పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొని తీవ్ర గాయాలతో విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న చింతపల్లి రాజు (35) సోమవారం మృతి చెందాడు. మండలంలోని మూలపాడు వద్ద ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగిన విషయం తెలిసిందే. గొల్లపూడిలోని తన కుమార్తెను తీసుకొచ్చేందుకు వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. మృతుడు రాజుకు 11 ఏళ్ల కుమార్తె ఉంది. భార్య గతంలోనే మరణించగా, ఇప్పుడు తండ్రి కూడా మృతి చెందడంతో తల్లిదండ్రుల ఆదరణకు నోచుకోలేని అనాథగా బాలిక మారింది.